# వ్యత్యాసం

కె. వరలక్ష్మి

ఈ పెద్దవాళ్ళిలా ఎందు కుంటారో నాకు కొంచెం కూడా అర్థం కావడం లేదు.

నన్ను స్కూల్లో వేసి పది రోజులయ్యిందా! రోజూ తాతయ్య మీద అమ్మ కోప్పడుతూనే వుంది.

కోప్పడ్డమంటే నన్ను తిట్టి నట్టు 'వెధవాయ్' అని ముఖం మీద తిట్టదు. కాని, వంటింట్లో గిన్నెలు గట్టిగా చప్పుడు చేస్తూ ఏమేమో అంటూ వుంటుంది.

అసలేం జరిగిందంటే-

నాకు బడికెళ్ళే వయసొచ్చిందట. అందుకని అమ్మ, నాన్నగారు నెల రోజు ల్నుంచి స్కూటర్ మీద ఊరంతా తిరిగి తిరిగి పెద్ద కాన్వెంట్లో సీటు సంపాదిం చారు. నన్ను జాయిన్ చేసే రోజు నాన్న గారు జేబులోంచి బోలెడన్ని డబ్బు తీసి స్కూలువాళ్ళ కివ్వడం చూసాను.

'అబ్బ! ఆ డబ్బులన్నీ నాకే ఇస్తే ఎంచక్కా బోల్డన్ని చాక్లెట్లు కొనుక్కుని తింటూ, ఇంటి దగ్గరే బాగా చదివేసుకుందును కదా!' అన్పించింది. ఆ మాటే తాతయ్యతో అంటే నవ్వేడు.

నన్ను రోజూ బడికి తీసుకెళ్ళి, మళ్ళీ ఇంటికి తీసుకు రావడం పని తాతయ్యదేనని చెప్పేడు నాన్న. అమ్మకి ఇంటిపనితోనూ, నాన్నకి ఆఫీసు పనితోనూ కుదర దట. రిక్షాలో పంపాలంటే రిక్షాలోంచి కింద పడతానే మోనని భయంట. తాతయ్యేమనుకున్నాడో నాకు తెలీదుకాని, నేను మాత్రం చాలా సంతోషపడ్డాను రోజూ తాతయ్యతో కలిసి బడికెళ్లొచ్చునని.

స్కూల్లో చేరిన మొదటి రోజే ఇంట్లో ట్యూషన్ చెప్పడానికట, ఒక టీచర్ని కుదిర్చారు. స్కూలు నుంచి రాగానే కొంచెం పాలైనా సరిగా తాగనివ్వదు, ఆ టీచర్ రెడీ. రోజంతా స్కూల్లో నేను నేర్చుకున్నవన్నీ మళ్ళీ ఆవిడ దగ్గర మరో గంట నేర్చుకోవాలి.

ఆవిడక్కూడా పది రూపాయిలో, వంద రూపా యిలో ఇస్తారు కాబోలు. అప్పటికే స్కూలు నుంచి నడిచి నడిచి ఇంటి కొస్తానేమో బలే చికాకుగా వుంటుంది.



పాపం తాతయ్య అయితే అలిసిపోయి మడత కుర్చీలో చేరబడిపోయేవాడు. కాని, అమ్మేమో తాతయ్యకి టీ వెంటనే ఇచ్చేది కాదు.

తాతయ్య నాన్నలాగా ఆఫీసుకెళ్ళడు. అప్పుడెప్పుడో వెళ్ళేవాడట. కాని, నేను పుట్టిన సంవత్సరం నుంచీ తాతయ్యకి ఆఫీసైపోయిందట. ముసలాళ్ళైతే ఎవరికైనా అలాగే అయిపోతుందట, నాన్న చెప్పేడు.

తాతయ్య నాకు భలే మంచి ఫ్రెండు. తాతయ్య కెన్ని కథలొచ్చో చెప్పలేం.

తాతయ్యంటే అమ్మకెందుకంత కోపమోనని ఒక సారి తాతయ్యనే అడిగేను. "ఏమోరా నాన్నా" అన్నాడు తాతయ్య.

అమ్మనడిగేను. "నాకేం కోపం? అలా అని ఆ ముసలాయనన్నాడా?" అంది కోపంగా అమ్మ. "పెన్షన్ డబ్బంతా కూతురు కిచ్చుకున్నాడు. ఉలుక్కి మాత్రం తక్కువేం లేదు" అని కూడా అంది. నాన్న డబ్బు చాలా

సంపాదిస్తున్నా, తాతయ్య కూడా అమ్మకి డబ్బెందు కివ్వాలో మరి, నాకు తెలీదు. డబ్బివ్వకపోతే అలాగే కోప్పడాలేమో!

అమ్మ కోప్పడుతున్నప్పుడల్లా తాతయ్య నాతో ఆడు కోవడం మొదలుపెడతాడు. కాని ఈమధ్యంతా అది కుదరడం లేదు. అందుకే కాబోలు తాతయ్య అదోలా వుంటున్నాడీమధ్య.

ఒకసారి తాతయ్య చెప్పాడు : తాతయ్యేమో నాన్నకి నాన్నట. నేనేమో తాతయ్యకి నాన్ననట. నాకు బలే నవ్వొచ్చింది. ఎక్కడైనా నా అంత బుల్లి నాన్నలుంటారా?

అంత పెద్దాడుంటాడా! తాతయ్య మాత్రం నేను తిన్నంత టిఫినే తింటాడు. నేను తినేంత అన్నమే తింటాడు. నాలా పాలు మాత్రం తాగడు, కాఫీ తాగుతాడు. అంత నల్లటి నీళ్ళలాంటి చేదు కాఫీ ఎలా తాగుతాడో మరి! యాక్!

అమ్మ రోజూ బాక్సులో టిఫిన్ పెట్టిస్తోంది. ఇంటర్ బెల్లైనప్పుడు నన్ను తినమని చెప్పింది. కొత్తలో తాతయ్య నేను భయపడతానేమోనని బడి ఆవరణలోని చెట్టు కింద ఎడిపెట్టే వరకూ కూర్చునేవాడు. ఇప్పుడు నాకిక బయ్యం లేదని చెప్పినాసరే అలాగే కూర్చుంటాడు.

అమ్మ రోజూ నేను ఇంటికి రాగానే వంటింట్లోకి పిల్చుకెళ్ళి "టిఫినంతా నీవే తిన్నావా లేదా?" అని అడిగేది.

# ఇరానీ 'టీ'

ఏ రాణీ తయారు చేస్తే యేం!
గుండెలో కూర్చొని
మద్రాస్‌లోనూ గుర్తుకొచ్చి
గుండెను మురిపెట్టే
హైదరాబాద్ 'ఇరానీ టీ'.

—కోడం పవన్

ఈమధ్యేసారి అరటి బజ్జీలు బాక్సులో వేసింది. అమ్మ. అవంటే తాతయ్య కెంతో ఇష్టం. అందుకే తాతయ్యకి కొన్ని పెట్టాను. ఆ విషయం చెప్తే అమ్మ సంతోషిస్తుందనుకుని, ఇంటికి రాగానే చెప్పేను. అమ్మ ఒక్క ఉదుటున తాతయ్య ముందుకెళ్ళి బాక్సును విసిరి కొట్టి "చిన్న పిల్లాడి కడుపు కొట్టి తినెయ్యడానికి సిగ్గుండక్కర్లా? ఎందుకు ఏళ్ళొచ్చినై మీాదకి?" అని అరిచింది.

అంతే! తాతయ్య మొహం తెల్లగా పాలిపోయింది. కలవరంతో నావేపు చూసాడు. ఏం జరిగిందో నేను తెలుసుకునే లోపల నన్ను రెక్క పుచ్చుకుని ఈడ్చుకెళ్ళి ట్యూషన్ టీచర్ ముందు కుదేసింది అమ్మ. మర్నాడు ఉదయాన్నే తన రెండు జతల బట్టల్నీ, నాయనమ్మ ఫోటోని సంచీలో కుక్కుకుని, తెగిపోయిన జోడుతో కాళ్ళీడ్చుకుంటూ పల్లెటూరికి ప్రయాణమయ్యాడు తాతయ్య. అక్కడ ఒక్కడూ వుంటాడు కాబోలు! మరి అన్నం అదీ ఎవరొండిపెడతారో పాపం!

** ** **

తాతయ్య వెళ్ళిపోయాక నెలకి వంద రూపాయిలిస్తానని ఆయాని పెట్టింది అమ్మ. ఆవిడే నన్ను రోజూ స్కూలుకు తీసుకెళ్ళి తీసుకొస్తోంది.

తాతయ్యలాగా నా చెయ్యి పుచ్చుకుని నడిపించదావిడ. తొందరగా నడవమని నా మీాద విసుక్కుంటుంది కూడా.

అమ్మ పెట్టిన టిఫిన్లో సగం పైగా ఆవిడే తినేస్తోంది. ఈ విషయం అమ్మతో చెప్తే తంతానంది.

తాతయ్యలాగే నాకూ అరటిబజ్జీ లిష్టం. అందుకే ఈ రోజిక ఇంటికి రాగానే భయపడుతూనే అమ్మకి చెప్పేసానా విషయం.

అప్పుడు అమ్మ నాకన్నా భయపడుతూ "గట్టిగా అరవకురా బడుద్దాయ్! దొరక్క దొరక్క ఆయా దొరికింది. అది మానేస్తే మళ్ళీ మనిషి కోసం వెతుక్కో లేక చావాలి. పోతే పోయిందిలే వెధవ టిఫిను. ఇంటికి రాగానే నేను మళ్ళీ పెడతాగా" అంది. నాకు బలే ఆశ్చర్యమేసింది.

ఈ పెద్ద వాళ్ళెప్పుడెలా నడుచుకుంటారో నాకు కొంచెం కూడా అర్థం కావడం లేదు. ●

